క్లుప్తంగా

ఘాట్‌రోడ్డుపై ఆగిన బస్సు

బి.కొత్తకోట: పర్యాటకులతో హార్సిలీహిల్స్ పైకి వెళ్తున్న మదనపల్లె–1 డిపో ఆర్టీసీ బస్సు కొంతసేపు ఘాట్‌రోడ్డు మలుపులో ఆగిపోవడం ఆందోళన కలిగించింది. కిందనుంచి మూడో మలుపు వద్దకు వచ్చే ముందు డ్రైవర్ గేరు మార్చుకుని వెళ్లాలి. అయితే డ్రైవర్ మలుపు మిట్టపైకి వెళ్లాక గేర్ మార్చడంతో బస్సు ముందుకు కదలలేదు. ఈ విషయం తెలుసుకున్న చీఫ్ ఇన్స్‌పెక్టర్ రేవతి తక్షణమే మరో డ్రైవర్‌ను పంపడంతో బస్సును ముందుకు తీసుకెళ్లారు. దీనితో టెన్షన్ తీరింది. కాగా మదనపల్లె–1 డిపో చీఫ్ ఇన్స్‌పెక్టర్ రేవతి రోజంతా హార్సిలీహిల్స్ బస్సులను స్వయంగా పర్యవేక్షించారు.

మారెమ్మతల్లి కాపాడమ్మా..!



దండుమారెమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె: గ్రామ దేవత దండమారెమ్మ తల్లి కాపాడవమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని కన్నెమడుగులో వెలసిన దండుమారెమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి వైభవంగా ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కన్నెమడుగు, మద్రిమాకులపల్లె, ఎద్దులవారిపల్లె గ్రామాల ప్రజలు వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజారి శంకర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు. కళాకారుల బృందాలచే రాత్రంతా ఆలయంలో భజనలు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం



ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

కలకడ: మండలంలోని ప్రముఖ ఆలయాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆంగ్లసంవత్సరాదిని పురస్కరించుకొని భక్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ కోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదానం, అభిషేకాలు, భజనలు చేశారు. ఆలయాలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

స్వాభిమాన పోరాటాలకు స్ఫూర్తి భీమా కోరేగావ్‌శౌర్య



అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పీలేరురూరల్: స్వాభిమాన పోరాటాలకు స్ఫూర్తి భీమా కోరేగావ్‌శౌర్య యుద్ధవీరులని అని మాల మాహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ అన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద భీమా కోరేగావ్‌శౌర్య 207వ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసం ఆత్మస్థైర్యంతో ఫిశ్వా సైన్యంతో విజయం వైపు తొలి అడుగులు వేసి ప్రపంచ వీరగాథల చరిత్రలో భీమా కోరేగావ్ యుద్ధవీరులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు వెంకట్రామయ్య, మస్తాన్, రవిచంద్ర, రెడ్డెప్ప, యల్లప్ప, దామోదర, మల్లయ్య, అప్పల్ల ఆచారి తదితరులు పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ పింపిణీ

కలకడ: మండలంలో 96 శాతం మందికి పింఛన్ అందించినట్లు ఎంపీడీఓ అబ్దుల్‌రహీం తెలిపారు. మొదటి రోజు 8 శాతం మందికి మాత్రం నిత్యవసరుకులు అందించినట్లు తహసీల్దార్ పనికుమార్ తెలిపారు. బుధవారం 1వతేదీన అందించాల్సిన పింఛన్ ఒక రోజు ముందుగా అందజేశామన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, డప్పు కళాకారులు వంటి వివిధ పెన్షన్ లబ్దిదారులు 5216 మంది ఉండగా 5201 మందికి అందజేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. పింఛన్ తీసుకోని వారికి గురువారం సాయంత్రం లోపు అందజేయడం జరుగుతుందన్నారు. 10,256 కార్డులకుగాను నూతన సంవత్సర వేడకల్లో భాగంగా అనేక మంది అందుబాటులో లేనికారణంగా కేవలం 08 శాతం మందికి మాత్రమే ఎండియూ ఆపరేటర్లు, చౌకదుకాణ డీలర్లు మొదటిరోజు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. గురువారం నుంచి కార్డు దారులకు నిత్యం అందుబాటులో ఉండి సరుకుల పంపిణీ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

- ప్రముఖులకు శుభాకాంక్షల వెల్లువ
- కిటకిటలాడిన దేవాలయాలు







మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల, నిసార్‌అహ్మద్‌కు నూతనసంవత్సర శుభాకాంక్షలుతెలుపుతున్న నాయకులు, సబ్ కలెక్టర్‌తో రెవెన్యూ సిబ్బంది

మదనపల్లె: ఆంగ్ల నూతన సంవత్సరాది 2025ను పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గంలో పలుచోట్ల సందడి వాతావరణం కనిపించింది. గత ఏడాదితో పోలిస్తే... ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో, నయా జోష్‌తో సందడి చేశారు. మంగళవారం సాయంత్రం నుంచే పట్టణంలో నూతన సంవత్సర సంబరాలు మొదలయ్యాయి. బైపాస్‌రోడ్డులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పెద్ద పెద్ద పట్టణాల్లో మాదిరిగా... సెలబ్రిటీలతో, టీవీ ఆర్టిస్ట్స్, యాంకర్స్‌తో ఈవెంట్ నిర్వహించారు. రాత్రి 9 గంటల నుంచి టపాకాయల పేలుళ్లు, యువకులు టూ వీలర్లతో రోడ్లపై చక్కర్లు కొట్టారు. సరిగ్గా అర్ధరాత్రి 12గంటలకు కేక్ కటింగ్‌లు, బాణాసంచా పేలుళ్లతో పట్టణం కోలాహలంగా మారింది. బుధవారం వేకువజామునుంచే పట్టణంలో నూతన సంవత్సర సందడి మొదలైంది. ఆలయాలకు వెళ్లే భక్తులు, అధికారులకు, రాజకీయనాయకులకు, బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లే వారితో రద్దీగా కనిపించింది. ఫ్లవర్ బొకే, స్వీట్స్, పండ్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. తెలిసిన వారు, సన్నిహితులు కనిపిస్తే ఒకరికొకరు మర్యాదపూర్వకంగా పలుకరించుకోవడం, చాక్‌లెట్స్, షేక్ హ్యాండ్స్ ఇచ్చుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రముఖులకు శుభాకాంక్షల వెల్లువ :

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని పలువురు ప్రముఖులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉదయం 8 గంటల నుంచే నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాసానికి తరలివచ్చారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త ఏడాది నియోజకవర్గ ప్రజలందరికీ సుఖశాంతులు కలుగజేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో డ్వామా పీడీ వెంకటరత్నం, ఈఈ గంగాధరం, తహసీల్దార్ ఖాజాబీ, ఎంఈఓ ప్రభాకరరెడ్డి తదితరులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి నివాసాల వద్ద శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులు, అభిమానులతో సందడిగా కనిపించింది. తమను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ వారు పేరుపేరునా పలకరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపి



మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నవారిలో ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీమ్ అస్లాం, నాయకులు తట్టిశ్రీనివాసులురెడ్డి, సుధాకరరెడ్డి, ఇర్ఫాన్‌ఖాన్, సదాశివరెడ్డి, సురేంద్ర, కోటూరిఈశ్వర్, బావాజాన్ తదితరులు ఉన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి :

మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో సిబ్బంది గత ఏడాది చక్కగా పనిచేశారని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది ప్రజాసమస్యల పరిష్కారానికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. బుధవారం ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ, సబ్‌కలెక్టరేట్ సిబ్బంది సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ రాఘవేంద్ర, డీటీ కుమారి, ఇమ్రాన్, సాయి, భరత్, సయ్యద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో..

కురబలకోట: నూతన సంవత్సరాన్ని మండల ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. కొత్త సంవత్సరాన్ని ఘనంగా స్వాగతించారు. ఎక్కడ చూసినా సందడి కన్పించింది. ఆలయాలు కిటకిటలాడాయి. పండ్లు, పూలు, స్వీట్, గ్రీటింగ్స్ దుకాణాలు వినియోగదారులతో కళకళలాడాయి. అంగళ్లు మల్లయ్య కొండ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గొనివారిపల్లె సర్వ మంగళ భారీ ఆంజనేయుడి విగ్రహం వద్ద, తెట్టు శ్రీ వేణుగోపాల ఆలయంలో వివిధ



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

ప్రాంతాల వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాజీ మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

పీలేరు రూరల్ : మాజీ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సదుంలో మాజీ మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు రూరల్ :

నూతన సంవత్సర వేడుకలు పీలేరు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల 2025 కేక్ కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక వెంకటాద్రిళ్ల సమీపంలో వెంకటేశ్వరస్వామి ఆలయం, స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి, కోటపల్లె శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, అగ్రహారం లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని భక్తులు పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై నయా జోష్



కొత్త వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న సందర్శకులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై బుధవారం నూతన సంవత్సర వేడుకలను సందర్శకులు ఉల్లాసంగా..ఉత్సాహంగా జరుపుకున్నారు. జిల్లానుంచే కాక పొరుగుజిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు భారీగా తరలివచ్చారు. సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు మంగళవారం రాత్రే ఇక్కడకు చేరుకొని విడిది చేశారు. బుధవారం ఉదయం నుంచి సందర్శకుల రాక పెద్దగా లేనప్పటికి మధ్యాహ్నం తర్వాత రద్దీ పెరిగింది. కొండకు తరలివచ్చిన పర్యాటకులతో రోడ్లు, సందర్శన ప్రాంతాలు కిటకిటలాడాయి. జంతుప్రదర్శనశాల, పాత, కొత్త, అటవీ వ్యూపాయింట్ల నుంచి ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపించారు. కొండపైకి ఆటోలు, బైక్‌లను నిషేధించడంతో కొండకింద చెక్‌పోస్టు వద్దే వాటిని నిలిపివేశారు. అటవీప్రాంగణ సందర్శనకు 3,500 మంది పర్యాటకులు వచ్చారు. నాలుగు వేల మందికిపైగా కొండను సందర్శించారు. బి.కొత్తకోట, కాండ్లమడుగు, మదనపల్లె నుంచి 25 ఆర్టీసీ బస్సులను నడిచాయి. బస్సులు అందుబాటులో ఉన్నప్పటికి పర్యాటకులు తొమ్మిది కిలోమీటర్ల ఘాట్‌రోడ్డులో నడుచుకొంటూ కొండకు చేరుకొన్నారు. గాలిబండపై పర్యాటకులు సేదతీరారు. ఇక్కడినుంచి మూడువైపులా కనిపించే ప్రకృతి అందాలను వీక్షిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు.

ఆంక్షలతో ప్రశాంతం

కొత్త ఏడాది వేడుకలు జరుపుకునేందుకు వచ్చిన పర్యాటకులకు ఏలాంటి ఇబ్బందులకు లేకుండా పోలీసులు విధించిన ఆంక్షలు ఫలించాయి. కింద నుంచి మద్యం తీసుకెళ్లడంపై కఠినంగా వ్యవహరించారు. ఆటోలు, బైక్‌లలో ప్రయాణాలను నిషేధించారు. కొండకింద చెక్‌పోస్టును పెట్టడంతో తనిఖీలు నిర్వహించి అడ్డుకొన్నారు. దీంతో పర్యాటకులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. బైక్, ఆటోలు నడవకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కడా కనిపించలేదు. కాగా ఈ కొత్త ఏడాదికి వచ్చిన సందర్శకుల సంఖ్య భారీగా తగ్గింది.

రాత్రంతా కొండపై నిశ్శబ్దం

హార్సిలీహిల్స్‌పై నూతన ఏడాదికి స్వాగతం పలికే విషయంలో చరిత్రలో లేని విధంగా మంగళవారం రాత్రి నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. అర్ధరాత్రి 12 దాటాక ప్రజలు, యువకులు కొండపై కేక్‌లు కట్ చేయడం, విందులు, మందుతో వినోదాలతో సందడి చేయడం అనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఘర్షణలు, బైక్ ప్రమాదాలు, మద్యం మత్తులో అల్లరి చేసేవాళ్లు. అయితే మంగళవారం రాత్రి కొండపై తెల్లవారుజాము వరకు సీఐ జీవన్ గంగనాథ్ బాబు స్వయంగా బందోబస్తు నిర్వహించారు. సందర్శకులు, విడిది చేసిన వారికి చిన్న ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

మల్లయ్యకొండకు పోటెత్తిన భక్తులు



స్వామికి దర్శనం కోసం క్యూలో భక్తులు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా భక్తులు పోటెత్తారు. అనంతపురం, కర్నాటక, సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున మల్లయ్యకొండకు వచ్చారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. ఈఓ మునిరాజ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు కల్పించారు. మదనపల్లె వన్‌డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి మల్లయ్యకొండ భక్తుల సౌకర్యం కోసం ఆరు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

చర్చిలో నూతన సంవత్సర ప్రార్థనలు



సందేశమిస్తున్న రెవ డాక్టర్ సునిల్‌వరకుమార్

మదనపల్లె సిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దనున్న జేసీఎం చర్చిలో బుధవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. డివిజన్ సంఘ కాపరి రెవ.డాక్టర్ సునిల్‌వరకుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్, సభ్యులు పాల్గొన్నారు. డేవిడ్ సంజయ్ బృందం భక్తిగీతాలు ఆలపించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. స్థానిక సిటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయం, బెంగళూరురోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయం, కోర్టులో గంగమ్మ, నీరుగట్టువారిపల్లెలో ని చౌడేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్టీ పటిష్టతపై దృష్టి పెడదాం

–ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో పార్టీ పటిష్టతపై కలసికట్టుగా పని చేద్దామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. బుధవారం నూతన ఏడాదిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమైందని గుర్తు చేశారు. రహదారుల అభివృద్ధిలో సాధించిన ప్రగతి చరిత్రగా నిలిచిపోతుందన్నారు. గ్రామస్థాయిలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు చెప్పడమేకాక వారి సమస్యలను చేపట్టి పరిష్కారం కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తూ మంచిని అడ్డుకుంటోందని ఈ విషయం గ్రామస్థాయిలో ప్రజలకు తెలపాలన్నారు. అలాగే గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పని చేయాలని కోరారు.

మంచి వ్యవస్థ కోసం కృషి చేద్దాం

రాయచోటి అర్బన్ : మెరుగైన సమాజాన్ని నిర్మించే బాధ్యత న్యాయవాదులదే అని రాయచోటి 5వ అదనపు జిల్లాజడ్జి కృష్ణన్‌కుట్టి పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో న్యాయవాదులైన మహాత్మా గాంధీ, డా.రాజేంద్రప్రసాద్ లాంటి మేధావులు ప్రధాన భూమిక పోషించారన్నారు. స్వాతంత్ర్యానంతరం కూడా ఒక మంచి వ్యవస్థను నిర్మించడానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్.గోపాలస్వామి అయ్యంగార్, మున్షిడికై తాన్‌లు న్యాయవాదులే అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని న్యాయవాదులంతా కూడా మంచి వ్యవస్థను నిర్మించడానికి, అందరి హక్కులను గౌరవించే విధంగా ఉండేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, భారత న్యాయవాదుల సంఘం నేతలు టి.ఈశ్వర్, రాజకుమార్, ధనుంజయ కుమార్, ఆనందర్‌కుమార్, చిన్నయ్య, రవిశంకర్, ఖాదర్‌బాషా, నిరంజన్, కుసుమ, వరలక్ష్మి, సయ్యద్, దేవేందర్‌రెడ్డి, నాగేశ్వర్ పాల్గొన్నారు.

'నూతన' ఉత్సాహం

కలికిరి (వాల్మీకిపురం): వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కిటకిటలాడి కోలాహలంగా మారింది. నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విచ్చేసి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడిని దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి మిఠాయిలు పంచి పెట్టి నూతన సంవత్సరాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మాజీ ఎమ్మెల్యే చింతల నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. దీంతో రాత్రి వరకు కూడా పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, పీలేరు మండల పార్టీ కన్వీనర్‌లు రమేష్‌కుమార్‌రెడ్డి, నీళ్ల భాస్కర్, కమలాకర్‌రెడ్డి, దండు జగన్మోహన్‌రెడ్డి, పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా, నాయకులు వెంకటరెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, ఎస్టీడి హరి, మధుసూదన్‌రెడ్డి, చక్రధర్, ప్రదీప్ రెడ్డి, సుధాకర్, కిశోర్, కోర్టు సుబ్బారెడ్డి, ద్వారకనాథరెడ్డి, శివాజీ, మునిరెడ్డి, బత్తల విశ్వనాథ, చంద్రశేఖరాచారి, రాజన్న, క్రిష్టాంజి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన వాయిదా

బి.కొత్తకోట: తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను చూసేందుకు గురువారం పర్యటించాల్సిన కేంద్ర బృందం పర్యటన వాయిదా పడిందని వ్యవసాయశాఖ అధికారులు బబుధవారం తెలిపారు. తదుపరి పర్యటన వివరాలు ఇంకా అందలేదని తెలిపారు.

కొండపై నీటి కష్టాలు

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై కొత్త సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు వచ్చిన సందర్శకులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడ్డారు. తాగునీటి కొళాయిలు లేకపోవడం, సందర్శకుల కోసం ముందస్తుగా కనీస ఏర్పాట్లు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండుచోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. వాటిని వినియోగించకోకుండా తాళం వేయడంతో సందర్శకులు తాగునీటి సౌకర్యం లేకుండాపోయింది. దీనితో కొండపై వచ్చిన సందర్శకులు తాగునీటి కోసం హోటళ్లను ఆశ్రయించి డబ్బు చెల్లించి నీటిని కొనాల్సి వచ్చింది. చాలామంది కొండ కిందనుంచి వాటర్ క్యాన్లను వెంట తీసుకొచ్చారు. వాటిని తమ వెంట మోసుకుని వెళ్తూ కనిపించారు.

'సెలవు దినాల్లో స్టడీ అవర్స్ సరికాదు'

రాయచోటి టౌన్ : సెలవు దినాలలో వంద రోజుల ప్రణాళిక పేరిట ఉదయం 8గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు 10వ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించడం సబబు కాదని పీఎస్టీయూ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ మజహరుల్ హక్ డీఈఓకు తెలిపారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఈఓ శివప్రకాష్‌రెడ్డిలను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు.ఇలా స్టడీ అవర్స్ నిర్వహించడం వలన ఉపాధ్యాయులపైనే కాకుండా విద్యార్థులపై ప్రభావం చూపుతుందన్నారు.

గుర్రంకొండ కోటలో పర్యాటకుల సందడి



గుర్రంకొండ కోటలో పర్యాటకులు

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో 2025నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజామునే గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి బాణా సంచాపేల్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మండలంలోని తరిగొండలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, గుర్రంకొండలోని కోట వినాయకాంజి నేయస్వామి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామివార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు.

పర్యాటకులతో కిక్కిరిసిన కోట

చారిత్రాత్మక గుర్రంకొండ కోట పర్యాటకులతో కిక్కిరిసి పోయింది. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని ఉదయం నుంచే కోటలో పర్యాటకుల సందడి మొదలైంది. ఉదయం నుంచి సాయంకాలం వరకు పెద్ద ఎత్తున పర్యాటకులు కోటకు చేరుకొని అక్కడి పరిసరాలు, కొండపైన ప్రకృతి అందాలను ఆస్వాదించారు. పలువురు కొండపైకి ఎక్కి సాయంకాలం వరకు అక్కడే గడిపారు. కోటపరిసరాల్లో పెద్ద ఎత్తున పర్యాటకుల వాహనాలు బారులు తీరాయి. రాయలసీమ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు కోటకు చేరుకొని విశేషాలను తిలకించారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా



ప్రత్యేక అలంకారంలో రెడ్డెమ్మతల్లి



అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. 2025 నూతన సంవత్సరం ప్రారంభరోజు కావడంతో కర్ణాటకా, తమిళనాడు రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ఆలయ మెట్లకు పూజలు నిర్వహిస్తూ మొకాళ్లపైనడిచి ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం వేలాది మంది భక్తులకుఆలయంలో ఆన్నదానం చేశారు. మండలంలోని తరిగొండలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంకాలం వరకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో టీటీడీ వారి నూతన క్యాలెండర్లు, డైరీలని అధికారులు విక్రయించారు. మండలంలోని ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న వెల్‌విషర్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని మహిళా ఎస్.ఐ రమాదేవి అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. రక్తదానం అన్ని దానాల్లో కన్నా గొప్పదన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడంతో వారిని ఆపద నుంచి కాపాడినవారమవుతామన్నారు. రక్తదానం చేయడంలో అపోహలు విడనాడాలన్నారు. వెల్‌విషర్స్ సంస్థ రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు డాక్టర్ భార్గవ్, సిబ్బంది, వెల్‌విషర్స్ వ్యవస్థాపకులు గిరీష్, అరుణ్, భానుప్రకాష్, రెడ్డిశేఖరెడ్డి, లక్ష్మిపతి, ఇళయరాజ, రామాంజులురెడ్డి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి తిరుమల లడ్డూ అందజేశారు.